జనం కోసం.. అక్షర సమరం

# ఇదీ సంగతి

స్పెషల్ ఎడిషన్

Epaper.Edisangathi.com

సంపుటి: 4 - సంచిక: 323 | 16 జులై 2026 | గురువారం | 4 పేజీలు






## వేటగాళ్ల ముఠా..

# గుట్టురట్టు..!

◆ రెండు వేర్వేరు కేసుల ఛేదన..

◆ 9 నాటు తుపాకుల స్వాధీనం

◆ 10 మంది అరెస్టు..

(జగదీష్ టేక్మాల్, ఇదీ సంగతి)

**నిజామాబాద్ జిల్లాలో వరుసగా వెలుగుచూసిన రెండు చిరుతపులుల మృతి ఘటనల వెనుక ఉన్న వేట ముఠాల గుట్టును పోలీసులు రట్టు చేశారు. ధర్పల్లి, భీంగల్ మండలాల్లో వెలుగుచూసిన చిరుత మృతి కేసుల దర్యాప్తులో కీలక ఆధారాలు లభించడంతో అటవీశాఖ, పోలీసులు సంయుక్తంగా చేపట్టిన చర్యల్లో వన్యప్రాణుల వేటకు ఉపయోగిస్తున్న తొమ్మిది లైసెన్సులేని నాటు తుపాకులను స్వాధీనం చేసుకొని పది మందిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు పోలీస్ కమిషనర్ సాయి చైతన్య తెలిపారు.** అరెస్టయిన వారిలో భూక్యా రఘుపతి, కార్ల అంజయ్య, ముదావత్ తిరుపతి, భూక్యా చందర్, ముర్రి గంగ నర్సయ్య, అనిమేని లింబాద్రి, మాలావత్ కుంభ, బానావత్ గంగారెడ్డి, మాలావత్ ధారి సింగ్, అకునూర్ రాజు ఉన్నారు. వీరందరిపై ఆర్మ్స్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.ఈ మేరకు గురువారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సిపి సాయి చైతన్య, జిల్లా అటవీశాఖ అధికారి సంయుక్తంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో కేసుల వివరాలను వెల్లడించారు. పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు సీసీఎస్, భీంగల్ పోలీసులు గురువారం తెల్లవారుజామున దేవక్కపేట గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. విశ్వసనీయ సమాచారం మేరకు అడవిలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా వారి వద్ద తొమ్మిది లైసెన్సులేని నాటు తుపాకులు లభించాయి. వాటిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.ప్రాథమిక విచారణలో నిందితులు అడవి జంతువులు, ఇతర వన్యప్రాణులను వేటాడేందుకే ఈ నాటు తుపాకులను వినియోగిస్తున్నట్లు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. ఇటీవల దేవక్కపేట అటవీ ప్రాంతంలో చిరుత మృతి చెందిన ఘటన తర్వాత పోలీసులు, అటవీశాఖ విస్తృత తనిఖీలు చేపట్టడంతో తమ వద్ద ఉన్న తుపాకులను అడవిలో దాచిపెట్టేందుకు తీసుకెళ్తుండగా పట్టుబడ్డట్లు వెల్లడించారు. (మిగతా 3లో)

## గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై కమిషనర్ దృష్టి

(నిజామాబాద్ ప్రతినిధి, ఇదీ సంగతి)



వచ్చే ఏడాది జరగనున్న గోదావరి పుష్కరాలకు సంబంధించి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన భద్రత, మెరుగైన సౌకర్యాలు కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయిచైతన్య అధికారులను ఆదేశించారు. గురువారం మెండోరా మండలంలోని పోచంపాడు (శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్) వద్ద ఉన్న పుష్కర ఘాట్లను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఘాట్ల వద్ద భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని చేపట్టాల్సిన ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్, వాకింగ్ ట్రాక్‌ల ఏర్పాటు గురించి సంబంధిత అధికారులతో చర్చించారు. పుష్కరాల సమయంలో సురక్షితమైన రాకపోకలకు అనువైన మార్గాలను సిద్ధం చేయాలని సూచించారు. లక్షలాది మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున కమాండ్ కంట్రోల్ వ్యవస్థ, నిరంతర సీసీ కెమెరాల నిఘా, తాత్కాలిక పోలీస్ సహాయ కేంద్రాలు, వైద్య శిబిరాలు, తాగునీరు, పారిశుద్ధ్య చర్యల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. వివిధ శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ, పుష్కరాలను విజయవంతం చేసేందుకు పోలీస్ శాఖ సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ పర్యటనలో ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వరరెడ్డి, ఆర్మూర్ రూరల్ సీఐ జాన్ రెడ్డి, మెండోరా ఎస్సై సుహాసిని, ఇరిగేషన్ శాఖ డీఈ సురేష్, ఏఈలు సుశాంత్ కుమార్, వంశీ, పంచాయతీరాజ్, రెవెన్యూ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కేజీబీవీ పాఠశాలను సందర్శించిన కలెక్టర్

(నిజామాబాద్, ఇదీ సంగతి)



నందిపేట మండల కేంద్రంలోని కస్తుర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం సందర్శించారు. పాఠశాల ఆవరణను, డార్మెటరీ, స్టోర్ రూమ్, కిచెన్, తరగతి గదులను పరిశీలించారు. బియ్యం బస్తాలు, ఇతర ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేశారు. ఆహార పదార్థాలు కలుషితం కాకుండా శుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, మెనూ ప్రకారం పిల్లలకు పౌష్టికాహారం అందించాలని ఆదేశించారు. అనంతరం 7వ తరగతి గదికి వెళ్లి విద్యార్థినులతో భేటీ అయ్యారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. తన వెంట తెచ్చిన చాక్లెట్లు, బహుమతులను విద్యార్థినులకు అందించారు. ఇష్టపడి చదువుకోవాలని, లక్ష్యాన్ని నిర్దేశించుకుని పట్టుదలతో ముందుకు సాగాలని ఉద్బోధించారు. కలెక్టర్ వెంట ఎంపీడీఓ శ్రీనివాస్ రావు, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ శాంతికుమారి తదితరులు ఉన్నారు.

జనం కోసం.. అక్షర సమరం

# ఇదీ సంగతి

సంపుటి: 4 - సంచిక: 323 | 16 జులై 2026 | గురువారం | 4 పేజీలు




## గుణపాఠం నేర్చుకోలేని..

# జైలు శాఖ..!




- వరుస వివాదాలతో మళ్లీ మసకబారిన నిజామాబాద్ సెంట్రల్ జైలు ప్రతిష్ఠ
- ఖైదీతో వార్డర్ బేరసారాలు.. బెయిల్ ఇప్పించి చోరీల్లో వాటా
- గత గంజాయి వివాదం మరువకముందే మరో ఘటనతో తీవ్ర విమర్శలు

**జిల్లా జైలు నుంచి కేంద్ర కారాగారంగా ఎదిగినా.. పాత వాసనలు మాత్రం వదలడం లేదు. కొందరు అధికారుల కాసుల కక్కుర్తి జైలు ప్రతిష్ఠను మసకబార్చుతోంది.** పరివర్తన కోసం జైలుకు వచ్చిన ఖైదీలనే అక్రమాల సాధనంగా మార్చు కుంటున్నారనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. గతంలో గంజాయి వ్యవహారంతో రాష్ట్రవ్యాప్తంగా అపఖ్యాతి పాలైన నిజామాబాద్ కేంద్ర కారాగారం.. తాజాగా రిమాండ్ ఖైదీతో వార్డర్ అక్రమ ఒప్పందం కుదుర్చుకున్న ఘటనతో మరోసారి వివాదాల్లో చిక్కుకుంది. వరుస ఘటనలు వెలుగుచూస్తున్నా జైలు శాఖ మాత్రం గుణపాఠం నేర్చుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.గత ఏడాది జైలులో గంజాయి సరఫరాపై ఖైదీల మధ్య ఘర్షణ జరగడం, అనంతరం వారిపై దాడి జరిగిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఆ ఘటనలో ఒక డిప్యూటీ జైలర్ సస్పెండ్ కాగా, మరొకరిని బదిలీ చేశారు. జైలు సూపరింటెండెంట్‌ను సైతం విధుల నుంచి తాత్కాలికంగా తప్పించారు. ఇంత పెద్ద ఘటన తర్వాతైనా వ్యవస్థలో మార్పు వస్తుందని భావించినా, పరిస్థితుల్లో ఎలాంటి మార్పు కనిపించలేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. (మిగతా 3లో..)

(జగదీష్ టేక్మాల్, ఇదీ సంగతి)

## ఎస్ఐఆర్ ప్రక్రియ వేగవంతం చేయాలి

(నిజామాబాద్, ఇదీ సంగతి)



స్పెషల్ ఇంటెన్స్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియ వేగవంతం చేయాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. నగరంలోని 28వ డివిజన్లో ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కలిగి ఉండడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. కావున ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ప్రధానంగా ఎన్యుమరేషన్ పత్రాలను పూర్తిచేసి సంబంధిత బిఎల్ఓ లకు అందజేయాలన్నారు. అనేకమందికి ఎనిమరేషన్ ఫామ్ నింపడంలో గందరగోళం ఏర్పడుతుందని, కావున ఓటర్లకు బిఎల్వోలు, పార్టీ బీఎల్ఏ లు సహకరించాలని సూచించారు. కార్పొరేటర్ల సైతం తమ పరిధిలోని ఓటర్లకు తగు సూచనలు చేస్తూ ఎన్యుమరేషన్ ఫామ్ లను నింపి తిరిగి ఇచ్చేలా చూడాలన్నారు.

## బ్లాక్ బెల్ట్ డాన్ ప్రమోషన్ టెస్ట్‌కు జిల్లా నుంచి 22 మంది తైక్వాండో క్రీడాకారుల ఎంపిక

(నిజామాబాద్, ఇదీ సంగతి)



తెలంగాణ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీ (ఆదివారం) హైదరాబాద్‌లోని మల్లారెడ్డి గార్డెన్స్, కాప్రాలో నిర్వహించనున్న ప్రతిష్టాత్మక బ్లాక్ బెల్ట్ డాన్ ప్రమోషన్ టెస్ట్‌కు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి తైక్వాండో క్రీడాకారులు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా అమేచ్యూర్ తైక్వాండో అసోసియేషన్ -- నిజామాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి మరియు తైక్వాండో కోచ్ జె.సి. మనోజ్ కుమార్ మాట్లాడుతూ, నిజామాబాద్ జిల్లా నుంచి 22 మంది తైక్వాండో క్రీడాకారులు ఈ ప్రతిష్టాత్మక పరీక్షకు ఎంపికై పాల్గొనడం జిల్లాకు గర్వ కారణమని తెలిపారు. క్రీడాకారులు క్రమశిక్షణతో శిక్షణ పొందుతూ అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని, ఈ పరీక్షలో నూ విజయవంతంగా రాణిస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి అమేచ్యూర్ తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షులు బస్వా లక్ష్మీ నరసయ్య ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ సందర్భంగా బస్వా లక్ష్మీ నరసయ్య మాట్లాడుతూ, గత పదేళ్లుగా బస్వా గార్డెన్‌లో నిరంతరంగా నిర్వహిస్తున్న తైక్వాండో శిక్షణ ద్వారా వందలాది మంది విద్యార్థులు బ్లాక్ బెల్ట్‌లు సాధించారని తెలిపారు. అదేవిధంగా, తైక్వాండో కోచ్ జె.సి. మనోజ్ కుమార్ అందిస్తున్న సేవలను ప్రత్యేకంగా అభినం దిస్తూ, నిజామాబాద్ జిల్లాలో తైక్వాండో అభివృద్ధికి ఆయన చేస్తున్న కృషి అమూల్యమని కొనియాడారు. భవిష్యత్తులో నిజామాబాద్ జిల్లా నుంచి మరింత మంది క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి రాష్ట్రానికి, దేశానికి కీర్తి తీసుకురావాలని ఆకాంక్షించారు.

జనం కోసం..
అక్షర సమరం

# ఇదీ సంగతి

16 జులై 2026 । గురువారం । హైదరాబాద్ । 4 పేజీలు





# బోనం.. వైభవం

(సయ్యద్ మొబిన్, ఇదీ సంగతి)

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఆషాఢ బోనాల మహోత్సవాలు గోల్కొండ కోటలోని శ్రీ జగదాంబిక మహంకాళి అమ్మవారి ఆలయంలో గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో తలపై బోనాలు మోసుకుంటూ అమ్మవారికి మొక్కులు, పోతరాజుల నృత్యాలు, విన్యాసాలు, డప్పు చప్పుళ్లు, మేళతాళాలు, బాజాభజంత్రీలు, శివసత్తుల సిగాలు, అచ్చ తెలుగు వస్త్రధారణలో మహిళలు కన్నుల పండువగా సాగే ఊరేగింపు ఆషాఢ మాసంలో జరిగే అధ్యాత్మిక సందడి తెలంగాణ సాంస్కృతికి దర్పణం పడుతుంది. తెలంగాణలో కాకతీయుల కాలం నుంచి కొనసాగుతున్న బోనాల సంప్రదాయం ప్రజల విశ్వాసం, భక్తికి ప్రతీకగా నిలిచింది. ప్రతి ఇంటి మహిళ అమ్మవారిని కుటుంబ ఇలవేల్పుగా భావించి మొక్కులు చెల్లించుకోవడం ఈ పండుగ ప్రత్యేకత. గోల్కొండలో ప్రారంభమైన బోనాల ఉత్సవాలు దశలవారీగా హైదరాబాద్, సికింద్రాబాద్‌లోని ప్రధాన మహంకాళి ఆలయాలకు విస్తరించనున్నాయి. బోనాల ప్రారంభోత్సవం సందర్భంగా లంగర్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన వేదికపై రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ పాల్గొన్నారు. వారు శ్రీ గోల్కొండ జగదాంబికా మహంకాళి ఎల్లమ్మ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ట్రాఫిక్ మళ్లింపులు, ప్రత్యేక పార్కింగ్, సీసీ కెమెరాల నిఘా, డ్రోన్ పర్యవేక్షణతో పాటు వైద్య శిబిరాలు, తాగునీటి సదుపాయాలు, పారిశుద్ధ్య ఏర్పాట్లు కల్పించారు.

## సైదాబాద్ స్టీల్ బ్రిడ్జికి సంగం లక్ష్మీబాయి పేరు పెట్టాలి వినయ్ కిషోర్ యాదవ్

(హైదరాబాద్, ఇదీ సంగతి)



సైదాబాద్‌లో నూతనంగా నిర్మిస్తున్న స్టీల్ బ్రిడ్జికి ప్రముఖ సంఘసేవకురాలు, దివంగత సంగం లక్ష్మీబాయి పేరును నామకరణం చేయాలని తెలంగాణ స్వాభిమాన్ పరిషత్ రాష్ట్ర కన్వీనర్ వినయ్ కిషోర్ యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చంచల్‌గూడ ముద్రణాలయం నుంచి ఐఎస్ సదన్ మీదుగా సంతోష్‌నగర్ వరకు నిర్మిస్తున్న ఈ బ్రిడ్జికి ఆమె పేరు పెట్టడం ద్వారా మహనీయురాలికి సముచిత గౌరవం దక్కుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు హైదరాబాద్ ఎంపీ, ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీతో పాటు, మలక్‌పేట్ ఎమ్మెల్యే అహ్మద్ బలాల, యాకుత్‌పురా ఎమ్మెల్యే జఫ్ఫార్ హుస్సేన్ మిరాజ్‌లకు ఆయన వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఐఎం నాయకులు సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. అనంతరం సైదాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వినయ్ కిషోర్ యాదవ్ మాట్లాడుతూ.. సంగం లక్ష్మీబాయి నిరుపేద విద్యార్థుల విద్యాభివృద్ధికి దశాబ్దాల క్రితమే ఇందిరా సేవా సదన్ విద్యాసంస్థలను స్థాపించి, వేలాది మందికి ఉన్నత విద్యావకాశాలను కల్పించారు. ఆమె విద్యాసంస్థల్లో చదువుకున్న ఎంతోమంది విద్యార్థులు నేడు దేశవ్యాప్తంగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. సంఘసంస్కర్తగా, రాజకీయ నాయకురాలిగా, విద్యావేత్తగా ఆమె చేసిన సేవలు అపారమైనవి. ఆమె సైదాబాద్ ప్రాంతానికే గర్వకారణం అని కొనియాడారు. ఈ డిమాండ్‌ను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు త్వరలోనే ముఖ్యమంత్రి, సంబంధిత జిల్లా మంత్రులు, ఉన్నతాధికారులను కలిసి వినతిపత్రాలు సమర్పించనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్వాభిమాన్ పరిషత్ ప్రతినిధులు రాజు యాదవ్, సంతోష్, లక్ష్మీనారాయణ, దయానంద్, వేణు, రాకేష్, శ్రీకాంత్, ప్రభాకర్, శ్రీనివాస్, శేఖర్, సురేష్, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో డ్రగ్స్ కలకలం..

### - ఎమ్మెల్సీ కుమారుడు అరెస్ట్

(సయ్యద్ మొబిన్, ఇదీ సంగతి)

హైదరాబాద్ నగరంలో మాదకద్రవ్యాల వినియోగంపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నా, అసాంఘిక శక్తుల ఆగడాలు మాత్రం ఆగడం లేదు. తాజాగా మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి, హాష్ ఆయిల్ కొనుగోలు చేస్తూ ముగ్గురు యువకులు పోలీసులకు చిక్కారు. పట్టుబడిన వారిలో ప్రతిపక్ష పార్టీకి చెందిన ఒక ఎమ్మెల్సీ కుమారుడు ఉండటం రాజకీయ వర్గాల్లో తీవ్ర సంచలనం సృష్టిస్తోంది. మంగళ్‌హాట్ పరిధిలోని పురానాపూల్ ప్రాంతంలో కొందరు యువకులు మాదకద్రవ్యాల కొనుగోలుకు సిద్ధమవుతున్నారనే పక్కా సమాచారంతో పోలీసులు బుధవారం రాత్రి ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడిలో ఏడుగురు యువకులు ఉండగా, పోలీసులు ముగ్గురిని అదుపులోకి తీసుకోగా, మరో నలుగురు పరారయ్యారు. పట్టుబడిన వారిలో ఎమ్మెల్సీ కుమారుడు భరత్ రాజ్ రెడ్డితో పాటు అభిషేక్, బొట్టు యూనిత్ ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. నిందితుల నుంచి గంజాయి, హాష్ ఆయిల్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీరు మత్తు పదార్థాలకు అలవాటు పడ్డారనే అనుమానంతో, నిందితుల నుంచి రక్త నమూనాలను సేకరించి వైద్య పరీక్షల నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఇదే కేసులో సోని, వంశీ, మనోజ్, తులజ అనే మరో నలుగురు వ్యక్తులు పరారీలో ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. వీరి కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ప్రస్తుతం ఈ డ్రగ్స్ నెట్‌వర్క్ మూలాలు ఎక్కడున్నాయి వీరికి సరఫరా చేస్తున్నదెవరు అనే కోణాల్లో మంగళ్‌హాట్ పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

*మంత్రి రంగప్రవేశం.. కేసుపై నీలినీడలు? :* ఈ వ్యవహారంలో మరో ఆసక్తికరమైన అంశం తెరపైకి వచ్చింది. పట్టుబడిన వారిలో ఒకరు రాష్ట్ర ప్రభుత్వంలోని కీలక మంత్రికి అత్యంత సన్నిహితుడు కావడంతో, సదరు మంత్రి కేసును ప్రభావితం చేసేందుకు ప్రయత్నిస్తున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. కేసు నమోదు కాకుండా ఉండేందుకు ఏకంగా నగర పోలీస్ కమిషనర్‌కే ఫోన్ చేసి ఒత్తిడి తెస్తున్నట్లు చర్చ జరుగుతోంది. అధికార పార్టీకి చెందిన మంత్రి, ప్రతిపక్ష పార్టీకి చెందిన ఎమ్మెల్సీ కుమారుడిని కాపాడేందుకు రంగంలోకి దిగడంపై నగరంలో రకరకాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి. పోలీసులు ఈ కేసులో ఎంతవరకు పారదర్శకంగా వ్యవహరిస్తారనేది వేచి చూడాలి.

గురువారం
16 జులై 2026

# ఇది సంగతి

జనం కోసం.. అక్షర సమరం

## మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలి






(నిజామాబాద్ ఇదీసంగతి)

జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ద్వారా ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందేలా అధికారులు, వైద్యులు కృషి చేయాలని ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్.భూపతి రెడ్డి, అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా, కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. కలెక్టర్ అధ్యక్షతన బుధవారం మాతా శిశు సంరక్షణ ఆసుపత్రి కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అభివృద్ధి సలహా కమిటీ సమావేశం జరిగింది.

జీజీహెచ్ లో ఆయా విభాగాల ద్వారా అందిస్తున్న వైద్య సేవలు, అందుబాటులో ఉన్న సదుపాయాలు, ఇంకనూ అవసరమైన వసతులు, వైద్య పరికరాల గురించి సంబంధిత విభాగాల వైద్యాధిపతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం విద్యా వైద్య రంగాలకు ఎనలేని ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా వైద్యులు, సిబ్బంది ప్రజలకు అంకిత భావంతో వైద్య సేవలు అందిస్తూ, ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకాన్ని పెంపొందించాలని సూచించారు. ఆసుపత్రులకు అవసరమైన వసతులు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, వైద్య సేవలలో లోపాలకు తావులేకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని హితవు పలికారు. నిజామాబాద్ జీజీహెచ్ ఆసుపత్రికి ప్రతి రోజు సగటున సుమారు 1700 నుండి 2000 వరకు ఇన్ పేషెంట్లు వస్తున్నారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా, రోగులకు సంతృప్తికరంగా వైద్య సేవలు అందించాలని, రోగుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. ఆసుపత్రి నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని, ముఖ్యంగా కార్డియాలజీ, గైనకాలజీ, జనరల్ సర్జరీ వంటి కీలక విభాగాలను మరింత బలోపేతం చేయాలని సూచించారు. ఆయా విభాగాలకు అవసరమైన వెంటిలేటర్లు, ఆధునిక పరికరాలు, ఇతర సౌకర్యాల కల్పనకు కృషి చేస్తామని తెలిపారు. కాగా, ఆసుపత్రిలో తగిన మరమ్మతులు, అభివృద్ధి పనులు సకాలంలో చేపట్టడంలో నిర్లక్ష్యం వహిస్తున్న టీజీఎస్ఐడీసీ ఇంజినీరింగ్ అధికారులపై ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్లక్ష్యం వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడొద్దని సూచించారు. ప్రభుత్వం అవసరమైన అన్ని వసతులు కల్పిస్తోందని, అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ఆసుపత్రి అభివృద్ధికి కృషి చేయాలని పేర్కొన్నారు. ఎమ్మెల్యేలు ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా, డాక్టర్ భూపతి రెడ్డిలు మాట్లాడుతూ, అపారమైన అనుభవం కలిగిన వైద్యులు జిల్లాలో ఉన్నందున వారి సేవలను ప్రజలకు మరింత సమర్ధవంతంగా అందించాలని కోరారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి రాష్ట్ర స్థాయిలో మంచి గుర్తింపు తీసుకురావాలంటే ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పని చేయాలని పిలుపునిచ్చారు. పారిశుద్ధ్య నిర్వహణను అత్యంత ప్రాధాన్యంగా తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం మత్తు పదార్థాల నిర్మూలనకు అత్యంత ప్రాధాన్యమిస్తూ పనిచేస్తోందని, డీ-అడిక్షన్ సేవలను మరింతగా విస్తరించాలని అభిప్రాయపడ్డారు. అందుబాటులో ఉన్న సదుపాయాలను సమర్ధవంతంగా వినియోగిస్తూ, జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని రాష్ట్రంలో ఆదర్శవంతమైన ఆసుపత్రిగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు.

కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, ఆసుపత్రి పనితీరు, నిర్వహణ మరింత మెరుగుపడేలా ప్రతి ఒక్కరూ చొరవ చూపాలని అన్నారు. పీడియాట్రిక్స్, జనరల్ సర్జరీ, గైనకాలజీ, అనస్థీషియా, ట్రామా కేర్, డెర్మటాలజీ, మానసిక వైద్య విభాగం, ఆప్తాల్మాలజీ, రేడియాలజీ, జిల్లా క్యాన్సర్ సెంటర్, డీ-అడిక్షన్ సెంటర్ తదితర విభాగాల ద్వారా అందిస్తున్న వైద్య సేవలను క్రమం తప్పకుండా సమీక్షిస్తామని తెలిపారు. ఆయా విభాగాలలో అందుబాటులో ఉన్న పరికరాలు, అవసరమైన వెంటిలేటర్లు, మౌలిక సదుపాయాలపై పూర్తి వివరాలతో కూడిన నివేదికలను సమర్పించాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే కాన్పులు జరిగేలా చూడాలని, సాధ్యమైనంత వరకు సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యత ఇవ్వాలని హితవు పలికారు. మాతా శిశు మరణాలు సంభవించకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో నగర మేయర్ ఉమారాణి, ఐ.ఐ.హెచ్.ఎఫ్.డబ్ల్యూ చైర్ పర్సన్ డా.కవితా రెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, నుడా చైర్మన్ కేశ వేణు, రాష్ట్ర గీతా పారిశ్రామిక సహకార కార్పొరేషన్ శేఖర్ గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, జీజీహెచ్ ఇంచార్జి సూపరింటెండెంట్ డాక్టర్ రాములు, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణ మోహన్, డీఎంహెచ్ఓ డాక్టర్ రాజశ్రీ, సంబంధిత శాఖల వైద్య అధికారులు పాల్గొన్నారు.

## నిజమైన ఉద్యమకారులకే గుర్తింపు, సంక్షేమ పథకాలు దక్కాలి

(నిజామాబాద్ ఇదీసంగతి)



తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రత్యక్షంగా పాల్గొని, లాఠీ దెబ్బలు తిని, జైలుకు వెళ్లి, కేసులు ఎదుర్కొన్న నిజమైన ఉద్యమకారులను మాత్రమే గుర్తించాలని ప్రజాపంథా పార్టీ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యుడు, టీజేఏసీ నిజామాబాద్ జిల్లా ప్రతినిధి వి. ప్రభాకర్ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని సచివాలయం ఎదురుగా ఉన్న అమరవీరుల స్మారకం (అమర జ్యోతి) వద్ద నిజామాబాద్, కామారెడ్డి, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలకు చెందిన ఉద్యమకారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ.. గతంలో ఇతర రాష్ట్రాల ఏర్పాటు సమయంలో నిజమైన పోరాట యోధులు పక్కకు వెళ్లగా, పైరవీకారులు లబ్ధి పొందారని గుర్తు చేశారు. తెలంగాణ విషయంలో అటువంటి పొరపాట్లు జరగకూడదని స్పష్టం చేశారు. కమిటీ సభ్యులు పూర్తి పారదర్శకతతో వ్యవహరించి, నిజమైన ఉద్యమకారులకు సకాలంలో గుర్తింపు, గౌరవం, సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ ఉమ్మడి జిల్లా టీజేఏసీ చైర్మన్ గోపాల్ శర్మ, కన్వీనర్ గైని గంగారం, అక్తర్, బి. దేవరాం, బోధన్ జేఏసీ జనరల్ సెక్రటరీ బి. మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## నిజామాబాద్ నుంచి యూ.కేకు బియ్యం ఎగుమతులు

(నిజామాబాద్ ఇదీసంగతి)






భారత్--యునైటెడ్ కింగ్‌డమ్ మధ్య అమల్లోకి వచ్చిన సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం (జశీఎజూతీవష్ట్రవఅంఱజవ జుషశీఅశీఎఱష ంతీఝఱవ చూస్త్రతీవవఎవత్ - జజుూా) ద్వారా ఎగుమతులకు లభిస్తున్న అవకాశాలను వినియోగించుకుంటూ నిజామాబాద్ నగరంలోని గజానన్ రైస్ మిల్ యాజమాన్యం యునైటెడ్ కింగ్‌డమ్‌కు బియ్యం ఎగుమతులకు అనుమతులు సాధించింది. ఈ మేరకు గజానన్ రైస్ మిల్లు నుండి యూ.కే కు ఎగుమతి అవుతున్న సోనా మసూరి ఎక్స్పోర్ట్ క్వాలిటీ బియ్యం నిల్వలతో కూడిన వాహనాలకు కలెక్టర్ ఇలా త్రిపాఠి లాంఛనంగా జెండా ఊపి ప్రారంభించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సీఈటీఏ అమలుతో భారతీయ వ్యవసాయ ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్లలో మరింత ప్రాధాన్యత లభిస్తోందని తెలిపారు. ముఖ్యంగా తెలంగాణలో నాణ్యమైన వరి ఉత్పత్తికి ప్రసిద్ధి చెందిన నిజామాబాద్ జిల్లా నుంచి యూకేకు బియ్యం ఎగుమతులు ప్రారంభం కావడం జిల్లాకు గర్వకారణమని అన్నారు.

అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా నాణ్యమైన బియ్యాన్ని ఉత్పత్తి చేసి విదేశాలకు ఎగుమతి చేయడం ద్వారా రైతులకు మెరుగైన ధరలు లభించడంతో పాటు జిల్లాకు మంచి గుర్తింపు వస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని దేశాలకు కూడా జిల్లా నుంచి వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు పెరిగేలా అధికారులు, ఎగుమతిదారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరస్వామి, ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాస్, గజానన్ రైస్ మిల్ ప్రతినిధి హితేష్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ హయాంలో ఉద్యమకారులకు గుర్తింపు లేదు : డా. రమావత్ లాల్ సింగ్



(నిజామాబాద్ ఇదీసంగతి)

బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఉద్యమకారులకు గుర్తింపు లేదని తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక, డా. రమావత్ లాల్ లాల్ సింగ్ అన్నారు.బుధవారం హైదరాబాద్ అమరవీరుల స్థూపం వద్ద తెలంగాణ ఉద్యమ కారుల గుర్తింపు కమిటీ నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులను గుర్తించి,వారిని గౌరవించే దిశగా చర్యలు చేపట్టడం అభినందనీయమన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే మన యువతకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు విస్తృతంగా లభిస్తాయని మనమందరం ఆశించాం. ఆ ఆశయ సాధన కోసం వేలాది మంది ఉద్యమకారులు తమ చదువులు, ఉద్యోగాలు, కుటుంబాలను సైతం పక్కన పెట్టి తెలంగాణ కోసం పోరాడారని తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రామవత్ లాల్ సింగ్

అన్నారు . రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా ఉద్యోగాల కోసం యువత ఎంతో కష్టపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉద్యమకారులు మరియు వారి కుటుంబాలు ఆశించిన స్థాయిలో అవకాశాలు అందకపోవడం బాధాకరం. తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారుల సమస్యలను గుర్తించి, వారిని గౌరవించే దిశగా చర్యలు తీసుకోవడం అభినందనీయం. ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొన్న ప్రతి ఉద్యమకారుడి త్యాగాన్ని ప్రభుత్వం గుర్తించి మరింత ప్రోత్సాహం అందించాలని మనస్ఫూర్తిగా కోరుతున్నాం.

మా విజ్ఞప్తి ఏమిటంటే, తెలంగాణ ఉద్యమకారులు మరియు వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రత్యేక రిజర్వేషన్, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు, స్వయం ఉపాధి పథకాలు, పారిశ్రామిక రంగంలో ప్రత్యేక ప్రోత్సాహకాలు కల్పించాలి. ఉద్యమకారుల పిల్లలకు విద్యా, ఉపాధి రంగాల్లో ప్రాధాన్యత ఇవ్వాలి. వారి జీవితాలు ఆర్థికంగా, సామాజికంగా ఉన్నత స్థాయికి చేరేలా ప్రభుత్వం ప్రత్యేక విధానాన్ని రూపొందించాలి. తెలంగాణ కోసం పోరాడిన ఉద్యమకారులను గౌరవించడం అంటే తెలంగాణ ఆత్మను గౌరవించినట్లే. వారి త్యాగాలకు నిజమైన గుర్తింపు అని అన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో అనేక సమస్యలు..

## - మరమ్మతులపై దృష్టి సారించాలి.. - వచ్చే సమావేశానికల్లా పరిష్కరించాలి..
## - హాస్పిటల్ డెవలప్మెంట్ సొసైటీ సమావేశంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్...

(నిజామాబాద్, ఇదీ సంగతి)

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అనేక సమస్యలు ఉన్నట్లు తన దృష్టికి వచ్చిందని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా తెలిపారు. జిల్లా జనరల్ ఆసుపత్రి డెవలప్మెంట్ సొసైటీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆసుపత్రిలోని ప్రతి విభాగం అధికారులు సిబ్బంది బాధ్యతగా పనిచేయాలన్నారు. ప్రధానంగా వైద్యులు హాజరు విషయంలో రాజీ పడేది లేదని, ప్రతి ఒక్కరు నాణ్యమైన సేవలు అందించాలని కోరారు. ఆసుపత్రిలో సివిల్ వర్క్ సమస్యలు అనేకంగా నెలకొన్నాయని, వాటిని పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. చాలా సమయాల్లో ల్యాబ్, ఎక్స్ రే తదితర వాటికోసం వచ్చే వారికి ఇబ్బందులు కలుగుతున్నాయని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అలాగే కొందరు కిందిస్థాయి సిబ్బంది రోగుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. ప్రతి విభాగాధిపతి సిబ్బంది పనితీరుపై పర్యవేక్షణ చేయాలన్నారు. లి అధికారులు సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహిస్తూ రోగులకు ఉత్తమమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. వచ్చే సమావేశానికల్లా సమస్యలన్నీ పరిష్కారం అయ్యే విధంగా చొరవ తీసుకోవాలని తెలిపారు. ప్రధానంగా పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, మేయర్ కూరగాయల ఉమారాణి, డిఎంహెచ్వో రాజశ్రీ, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాములు తదితరులు పాల్గొన్నారు.



# గుణపాఠం నేర్చుకోలేని
# జైలు శాఖ..!



(మొదటి పేజీ తరువాయి)

తాజాగా కరీంనగర్ జిల్లాకు చెందిన రిమాండ్ ఖైదీ భిక్షపతి వ్యవహారం జైలు శాఖ పనితీరుపై తీవ్ర అనుమానాలకు తావిస్తోంది. వరుస దొంగతనాలకు పాల్పడిన భిక్షపతి నిజామాబాద్ సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉండగా, జైలు వార్డర్ గోపాల్‌రెడ్డి అతనితో అక్రమ ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. జైలు నుంచి బెయిల్‌పై విడుదలైన తర్వాత చేసే చోరీల్లో వాటా ఇవ్వాలనే షరతుతో అతడికి సహకరించినట్లు సమాచారం. ఇందుకోసం సుమారు రూ.70 వేల వరకు వసూలు చేసి బెయిల్ ప్రక్రియ సులభతరం చేసినట్లు దర్యాప్తులో బయటపడినట్లు తెలుస్తోంది.బెయిల్‌పై విడుదలైన కొద్ది రోజులకే భిక్షపతి సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో భారీ చోరీకి పాల్పడగా, పోలీసులు అరెస్టు చేశారు. విచారణలో జైలు వార్డర్ సహకారంతోనే తాను విడుదలైనట్లు భిక్షపతి వెల్లడించినట్లు సమాచారం. దీంతో జైలు వార్డర్ గోపాల్‌రెడ్డిని జైళ్ల శాఖ సస్పెండ్ చేస్తూ శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు. ఒక ఘటన నుంచి గుణపాఠం నేర్చుకుని వ్యవస్థను ప్రక్షాళన చేయాల్సిన జైలు శాఖలో వరుసగా ఇలాంటి ఆరోపణలు వెలుగుచూడడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. జైలు గోడల మధ్య జరుగుతున్న అక్రమాలపై ఉన్నతాధికారులు కఠినంగా స్పందించకపోతే కేంద్ర కారాగారం ప్రతిష్ఠ మరింత దెబ్బతింటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు చెప్పే క్రమశిక్షణ మాటల్లోనే మిగిలిపోతోందా జైలులో జరుగుతున్న అక్రమాలకు ఎవరు బాధ్యత వహిస్తారు అనే ప్రశ్నలు ఇప్పుడు జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

# చిరుత వేటగాళ్ల ముఠా గుట్టురట్టు..

(మొదటి పేజీ తరువాయి)

**మేక కళేబరంలో విషం.. చిరుత మృతి:** ఆర్మూర్ డివిజన్ పరిధిలోని కారేపల్లి దక్షిణ బీట్‌లో ఇటీవల వెలుగుచూసిన చిరుత హత్య కేసును కూడా అధికారులు ఛేదించారు. మేకల కాపరి మలావత్ సంజీవ్‌కు చెందిన మేకను చిరుత చంపడంతో దేవక్కపేటకు చెందిన సిరిసిల్ల రాములు చిరుతను చంపి దాని అవయవాలను విక్రయిస్తే లక్షల రూపాయలు వస్తాయని ఆశ చూపినట్లు విచారణలో తేలింది. దీంతో మలావత్ సంజీవ్ తన గ్రామానికి చెందిన మరో నలుగురితో కలిసి చనిపోయిన మేక కళేబరంలో సిరంజి ద్వారా విషం ఎక్కించారు. మరుసటి రోజు ఆ మేకను తిన్న చిరుత మృతి చెందగా, దాని కళేబరాన్ని కారేపల్లి దక్షిణ బీట్‌లోని 79వ కంపార్టుమెంట్లో భూమిలో పాతిపెట్టారు. సరైన కొనుగోలుదారు దొరికిన తర్వాత బయటకు తీసి విక్రయించాలని భావించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. నిందితులు చూపిన మేరకు అటవీశాఖ అధికారులు భూమిలో పాతిపెట్టిన చిరుత కళేబరాన్ని వెలికితీసి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం సిరిసిల్ల రాములు ఇంట్లో నిర్వహించిన తనిఖీల్లో మరో లైసెన్సులేని నాటు తుపాకీ లభించడంతో దానిని భీంగల్ పోలీసులకు అప్పగించారు. ఈ కేసులో మలావత్ సంజీవ్, సిరిసిల్ల రాములను అరెస్టు చేయగా మరో నలుగురు పరారీలో ఉన్నట్లు తెలిపారు.

**ఉచ్చులో చిక్కిన చిరుతను కొట్టి చంపారు**

నిజామాబాద్ అటవీ డివిజన్ పరిధిలోని ఇందల్వాయి అటవీ క్షేత్రం ఆమ్సన్‌పల్లి బీట్‌లో మూడు నుంచి ఐదు నెలల క్రితం జరిగిన మరో చిరుత వేట కేసును కూడా అధికారులు ఛేదించారు. అడవి పందుల వేట కోసం ఏర్పాటు చేసిన ఉచ్చులో చిక్కుకున్న చిరుతను నిందితులు కర్రలతో కొట్టి చంపినట్లు దర్యాప్తులో తేలింది. ఆ తర్వాత చిరుత మృతదేహాన్ని ధర్పల్లి గ్రామ శివారులోని మామిడి తోటకు తరలించి చర్మాన్ని ఒలిచి, నాలుగు పంజాలను వేరు చేశారు. మిగిలిన శరీర భాగాలను సమీపంలోని పాడుబడిన బావిలో పడేశారు. బావిలో నుంచి కుళ్లిపోయిన చిరుత చర్మాన్ని స్వాధీనం చేసుకొని పశువైద్య పరీక్షలకు పంపగా అది చిరుత చర్మమేనని నిర్ధారణ అయింది. దర్యాప్తులో వేటకు ఉపయోగించిన ఉచ్చులు, వేట సామగ్రి, చిరుత గోర్లు తదితర కీలక ఆధారాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేయగా మరో నిందితుడితో పాటు ఇతరుల కోసం గాలింపు కొనసాగుతోంది.

**కఠిన చర్యలు తప్పవు :** వన్యప్రాణులను వేటాడడం, వాటి అవయవాలను నిల్వ చేయడం, విక్రయించడం, రవాణా చేయడం తీవ్రమైన శిక్షార్హమైన నేరమని అధికారులు హెచ్చరించారు. వన్యప్రాణుల సంరక్షణకు భంగం కలిగించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అనుమానాస్పద కార్యకలాపాలపై ప్రజలు వెంటనే అటవీశాఖ లేదా పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

# విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలి

(నిజామాబాద్, ఇదీ సంగతి)

ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉన్నారని, అంకితభావంతో విధులు నిర్వర్తిస్తూ నాణ్యమైన విద్యను బోధించడం ద్వారా విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి సూచించారు. జిల్లాలో ఉత్తీర్ణత మెరుగుపడిందని, ఇదే స్ఫూర్తితో కృషి చేస్తూ నూటికి నూరు శాతం ఉత్తీర్ణత నమోదయ్యేలా చొరవ చూపాలని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో బుధవారం జిల్లా విద్యాశాఖ పనితీరుపై కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూళ్ళు, గురుకులాల నిర్వహణ తీరుతెన్నులు, సాధించిన ఫలితాలు, మౌలిక సదుపాయాల స్థితిగతులు తదితర అంశాలపై సమీక్ష జరిపి, అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

విద్యా రంగానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎనలేని ప్రాధాన్యత ఇస్తున్నారని, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కోట్లాది రూపాయలను వెచ్చిస్తున్నారని అన్నారు. విద్యా ప్రమాణాలను మెరుగుపర్చే విషయంలో ప్రభుత్వం ఎంతమాత్రం రాజీ పడబోదని సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. ఒక్కో విద్యా సంస్థకు 200 కోట్ల రూపాయల చొప్పున ఖర్చు చేస్తూ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ను ఏర్పాటు చేస్తోందని, ఇవి కాకుండా అన్ని రకాల అధునాతన సదుపాయాలతో



ప్రతి నియోజకవర్గంలో ఒకటి చొప్పున తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ నిర్మిస్తోందని గుర్తు చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నిధులు వెనక్కి మళ్లిపోకుండా, ప్రతి పైసా వినియోగంలోకి వచ్చేలా నిర్దిష్ట గడువులోగా అదనపు తరగతి గదులు, ఇతర సౌకర్యాల మెరుగుదలకు సంబంధించిన పనులను పూర్తి చేయాలన్నారు.

కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, విద్యా రంగంలో నిజామాబాద్ జిల్లా పనితీరు సంతృప్తికరంగా ఉందని అన్నారు. ప్రభుత్వ బడులలో విద్యార్థులు ప్రవేశాల విషయంలో రాష్ట్రంలో నిజామాబాద్ జిల్లా ఐదవ స్థానంలో ఉందని, ఈ నెలాఖరు వరకు లక్ష్యానికి అనుగుణంగా ప్రవేశాలు పూర్తి చేసి జిల్లాను ముందంజలో నిలుపుతామని తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే ప్రస్తుత విద్యా సంవత్సరంలో 21శాతం మేర ఎక్కువ ప్రవేశాలు జరిగాయని, నెలాఖరు నాటికి మరో 7శాతం ప్రవేశాలు పెంపొందించేలా కార్యాచరణతో ముందుకు వెళ్తున్నామని అన్నారు. వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలలను మండల స్పెషల్ ఆఫీసర్లు, ఆర్.సీ.ఓలు, జిల్లా అధికారులు సందర్శిస్తూ నిర్వహణ తీరుతెన్నులను నిశితంగా పరిశీలిస్తున్నారని అన్నారు. విద్యార్థిని, విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టిక ఆహారం అందేలా ప్రతి పాఠశాలలో ఆహార భద్రతా కమిటీలను ఏర్పాటు చేయించామని తెలిపారు. బాలికల విద్యాలయాల్లో విద్యార్థినుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని అన్నారు. మెరుగైన విద్యా బోధన అందించడం వల్ల ఈసారి పదవ తరగతిలో కేజీబీవీ, జ్యోతిబాపూలె, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్స్ తో పాటు ప్రభుత్వ పాఠశాలల్లోనూ మంచి ఫలితాలు వచ్చాయని వివరించారు.

ఈ సందర్భంగా ఎస్సెస్సీలో టాపర్లుగా నిలిచిన లహరిక, సౌజన్య, సంజన, లాస్య, అభిజ్ఞ తదితరులకు జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించగా, ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి తన తరపున ఒక్కొక్కరికి రూ. 5వేల చొప్పున నగదు పారితోషికం అందించి ప్రోత్సహించారు. ప్రభుత్వ బడులలో విద్యార్థుల ప్రవేశాలను పెంపొందించేందుకు కృషి చేసిన ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులను సైతం సన్మానించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, అదనపు కలెక్టర్ భుజంగరావు, ట్రైనీ కలెక్టర్ సురేష్, నుడా చైర్మన్ కేశ వేణు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, రాష్ట్ర గౌడ సంక్షేమ సంఘం చైర్మన్ శేఖర్ గౌడ్, డీ.ఈ.ఓ అశోక్, డీ.ఆర్.డీ.ఓ సాయాగౌడ్, విద్యా శాఖ అధికారులు, ఆర్.సీ.ఓలు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.